# 9 సర్కిళ్లలో అదనంగా 1494 డీటీఆర్‌లు

## వేసవిని తట్టుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ

## టెలీ కాన్ఫరెన్స్‌లో విద్యుత్ సరఫరా తీరుపై సీఎండీ సమీక్ష

సిటీబ్యూరో, ఏప్రిల్ 9(నమస్తే తెలంగాణ): వేసవి దృష్ట్యా వినియోగదారులకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఆ శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా అవసరమైన వసతులు కల్పించడంపై విద్యుత్ శాఖ దృష్టి సారించింది. గ్రేటర్ పరిధిలోని 9 సర్కిళ్లలో ఉన్న సబ్ స్టేషన్‌లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్(డీటీఆర్)లపై ఎక్కడెక్కడ అధికంగా లోడు ఉందో గుర్తించి, అక్కడ అదనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డీటీఆర్‌లను ఏర్పాటు చేసేలా సీఎండీ ముషారఫ్ ఫరూఖీ చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా సీజీఎంలు, సర్కిల్ ఎస్ఈలతో ఎప్పటికప్పుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రత్యేకంగా నివేదికలు తీసుకొని వెంటనే అక్కడ అదనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి కాలం ప్రారంభమయ్యే మార్చి, ఏప్రిల్ నెలల్లోనే ఈసారి ఊహించిన దానికంటే విద్యుత్‌కు ఎక్కువ డిమాండ్ వస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం వివిధ సబ్ స్టేషన్లలో 80 శాతం కంటే ఎక్కువ లోడు ఎదుర్కొంటున్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో ఎక్కువ కెపాసిటీ గల పీటీఆర్‌లతో మార్పిడి చేశారు. అదేవిధంగా డీటీఆర్‌లపై లోడ్ బ్యాలెన్సింగ్ కోసం టంగ్ టెస్టర్ ద్వారా కచ్చితమైన లోడ్లను రికార్డు చేస్తూ, డీటీఆర్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు గ్రేటర్ పరిధిలోని 9 సర్కిళ్లలో 1494 డీటీఆర్‌లు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఇలా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వేసవి కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేస్తూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేస్తున్నారు.

### వేసవిలో అదనంగా ఏర్పాటు చేసిన డీటీఆర్‌లు


| | |
|---|---|
| 100 కేవీఏ | 619 |
| 160 కేవీఏ | 752 |
| 315 కేవీఏ | 110 |
| 500 కేవీఏ | 13 |

### వేసవిలో అదనంగా ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు

- నారపల్లి సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏ
- జల్‌పల్లి సబ్ స్టేషన్‌లో 8 ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏ
- కందికల్ గేట్ సబ్ స్టేషన్‌లో కొత్తగా 8 ఎంవీఏ ఏర్పాటు
- ఇబ్రహీంబాగ్ సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏ
- కోకాపేట సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏ

### గ్రేటర్ పరిధిలో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు

| సర్కిల్ | మొత్తం డీటీఆర్‌లు |
|---|---|
| హైదరాబాద్ సెంట్రల్ | 9,200 |
| బంజారాహిల్స్ | 9,729 |
| సికింద్రాబాద్ | 7,951 |
| హైదరాబాద్ సౌత్ | 7,306 |
| రాజేంద్రనగర్ | 30,799 |
| మేడ్చల్ | 22,963 |
| సైబర్ సిటీ | 27,173 |
| హబ్సిగూడ | 14,449 |
| సరూర్‌నగర్ | 17,622 |
| మొత్తం | 1,47,192 |




# దప్పిక తీరేదెలా..!

## అడవులు వదిలి గ్రామాలకు తరలివస్తున్న పక్షులు, జంతువులు


మంగళ్‌పల్లి అటవీ ప్రాంతంలోని సాసర్‌పిట్

**దాహం తీరక మూగజీవాల విలవిల**
**నీటితొట్లు ఉన్నా నిరుపయోగం**
**పట్టించుకోని అటవీ శాఖ అధికారులు**
**తాగునీటిని ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి**

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 9 : వేసవిలో ఎండ వేడిమికి మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. అటవీ ప్రాంతాల్లో దప్పిక తీర్చుకోవడానికి నీరు దొరుకక పలు పక్షులు, జంతువులు మృత్యువాత పడుతున్నాయి. మరికొన్ని పక్షులు, జంతువులు అడవులు వదిలి గ్రామాలకు తరలివస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో తాగునీరు దొరుకక పక్షులు, జంతువులు పండుటాకుల్లా రాలిపోతున్నాయి. అటవీ ప్రాంతంలో పక్షులు, జంతువుల దప్పిక తీర్చడం కోసం పలు రిజర్వు ఫారెస్టుల్లో నిర్మించిన సాసర్‌పిట్లు నీరులేక వెలవెలబోతున్నాయి. ఫారెస్టుల్లో సాసర్‌కప్‌ల రూపంలో సుమారు యాభై నుంచి అరవై వరకు నిర్మాణాలు చేపట్టారు. ఈ సాసర్‌పిట్లలో రెండుమూడు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపితే అడవుల్లో ఉండే మూగజీవులైన పక్షులు, జంతువులు వీటిలో ఉన్న నీటితో దప్పిక తీర్చుకుంటాయి. ముఖ్యంగా అటవీ ప్రాంతంలో ఉన్న పక్షులకు, జంతువులకు ఈ నీరే ఆధారం.

ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని రిజర్వు ఫారెస్టుల్లో ఉన్న సాసర్‌కప్ గుంతల్లో ముందుగా నీటిని నింపినప్పటికీ వేసవి కాలంలో మాత్రం చాలా గోతుల్లో నీరు నింపడంలేదు. దీంతో అడవుల్లో నీరు దొరుకక కోతులు, అడవిపందులు, కుందేళ్లు, నెమళ్లు, ఇతర పక్షులు గ్రామాల బాట పడుతున్నాయి. ఇప్పటికే కోతులు, నెమళ్లు అడవుల్లో నీరు దొరుకక గ్రామాలకు చేరుకుంటున్నాయి. వేసవిలోనైనా అడవుల్లో ఉన్న దప్పిక తీర్చే గోతుల్లో ప్రతిరోజూ నీరు నింపితే బాగుంటుందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే, నియోజవర్గంలోని పలు గ్రామాల్లో పశువుల దప్పిక తీర్చడం కోసం నిర్మించిన నీటితొట్లు కూడా నీరులేక వెలవెలబోతున్నాయి. ముఖ్యంగా పశువులను అడవులకు వెళ్లి ఇంటికి వచ్చే సమయంలో నీటితొట్ల వద్దకు తీసుకెళ్లి వాటికి నీరు తాగించేవారు.

నీటి తొట్లకు ఆయా గ్రామపంచాయతీల నుంచి నల్లాల సౌకర్యాన్ని కూడా కల్పించారు. అయినప్పటికీ వాటి నిర్వహణ సరిగా లేక నీటి తొట్లలో చుక్క నీరు కూడా ఉండడంలేదు. దీంతో పశువులు కూడా నీరు లేక దాహంతో విలవిలలాడుతున్నాయి. పశువుల నీటి కోసం ఒక్కో గ్రామంలో రెండు నుంచి మూడు వరకు నీటి తొట్ల నిర్మాణం చేపట్టారు. ఈ నీటి తొట్ల నిర్మాణంతో పాటు పైపులైన్ ద్వారా నల్లా కనెక్షన్ కూడా ఇచ్చినప్పటికీ వాటిలో నీరు నింపడంలేదు. దీంతో నీటి తొట్లు వృథాగా మారాయి.

**ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని** ఆగాపల్లి, నోముల, గున్‌గల్, జాపాల, కాగజ్‌ఘాట్, తులేకలాన్, ఎలిమినేడు, కొంగరకలాన్, కప్పాడు, పోచారం, దండుమైలారం, నాగన్‌పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, లింగంపల్లి, మంచాల, ఆరుట్ల రంగాపూర్ ప్రాంతాల్లో అటవీ ప్రాంతం పెద్ద ఎత్తున విస్తరించి ఉన్నది. ఈ అటవీ ప్రాంతాల్లో మూగజీవాల దప్పిక తీర్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతనంగా సాసర్‌పిట్లను ఏర్పాటు చేశారు. గతంలో ప్రతి ఏడాది వేసవికాలంలో మూగజీవాల దప్పిక తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ట్యాంకర్ల ద్వారా నీటిని నింపింది. దీంతో గ్రామాల్లో ఉన్న పక్షులు, అటవీజంతువులు అటవీప్రాంతానికే పరిమితమై దప్పిక తీర్చుకుంటూ జీవించేవి. కాని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మూగజీవాల తప్పిక తీర్చటం కోసం అటవీ ప్రాంతంలో తాగునీటిని అందించకపోవటంతో మూగజీవాలు తప్పిక తీర్చుకోవడం కోసం గ్రామాల బాట పట్టాయి. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు మేల్కొని మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లను నింపాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల మంగల్‌పల్లి అటవీ ప్రాంతంలో తాగునీరు దొరుకక నెమళ్లు మృత్యువాతకు గురైనట్లు స్థానికులు తెలిపారు. అటవీప్రాంతంలో మూగజీవాలు మృత్యువాత పడకుండా నీటితొట్లలో నీటిని నింపాలని స్థానిక ప్రజలు, రైతులు కోరుతున్నారు.


మంగళ్‌పల్లి అటవీ ప్రాంతంలో నీరులేక ఖాళీగా ఉన్న కుండీ

## వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 9: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ(ఈవినింగ్) మొదటి సెమిస్టర్ రెగ్యులర్, ఎంబీఏ(టెక్నాలజీ మేనేజ్‌మెంట్-ఈవినింగ్) మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 22వ తేదీ నుంచి, ఎంబీఏ (పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్) నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 23వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# పార్లమెంటు సీట్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం

**ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారు**
**మహాజన సోషలిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌రావు**
**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం**

మొయినాబాద్, ఏప్రిల్ 9 : పార్లమెంటు సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని మహాజన సోషలిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ క్యాసారం శంకర్‌రావు అన్నారు. మంగళవారం మొయినాబాద్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ కొండిగారి మహేందర్ ఆధ్వర్యంలో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సీట్ల కేటాయింపులో అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రంలో మాదిగలు 70 లక్షలకు పైగా జనాభా ఉన్నారని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాదిగలు తగిన బుద్ధి చెబుతారన్నారు. 50 శాతం ఉన్న బీసీలకు కేవలం కంటితుడుపుగా కేవలం 2 సీట్లు మాత్రమే కేటాయించి ద్రోహం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే మాలల, రెడ్ల ప్రభుత్వమని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని మార్చుకుని మాదిగలకు 2 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌మాదిగ, జిల్లా కార్యదర్శి శివశంకర్‌మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్, ఎమ్మార్పీఎస్ మండల కో కన్వీనర్ రాజు, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, హరీశ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పార్టీ నేతలు

# షడ్రుచుల సమ్మేళనమే ఉగాది

## పాల్గొన్న మంత్రి జూపల్లి, సీఎస్ శాంతికుమారి


క్రోధినామ నామ సంవత్సర పంచాగాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి

రవీంద్రభారతి/కొండాపూర్/ఉప్పల్, ఏప్రిల్ 9: శ్రీ క్రోధి నామ సంవత్సరాది ఉగాది వేడుకలను రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమార్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, సమాచార, పౌర సంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ హన్మంతరావు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాచుపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి శ్రీక్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించి పంచాంగ పఠనం చేశారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది రైతులకు మేలు కలగాలని, ప్రజలందరికి కొత్త ఆశయాలు నెరవేరి సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన కోరారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి జీవితంలోని అనేక అనుభవాలకు ప్రతీకని, జీవితంలో ఎదురయ్యే అనేక అనుభావాలను ఎదుర్కొని ముందుకెళ్లాలని ఇది సూచిస్తుందన్నారు. రైతు కుటుంబాల్లో వసంతాలు తెచ్చి పున్నమి వెన్నలను నింపమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. అనంతరం సంతోష్‌కుమార్ శాస్త్రిని మంత్రి జూపల్లి కృష్ణారావు ఘనంగా సన్మానించారు.

### శిల్పారామంలో...

కొండాపూర్ : క్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మాదాపూర్‌లోని శిల్పారామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంపాదకులు, జ్యోతిష్కులు, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకర శర్మ ముఖ్యఅతిథిగా హాజరై పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది పండుగ విశిష్టత, కాలానుగుణంగా మారే రుతువులు వాటి ప్రభావాలు, ద్వాదశ రాశులు, ఆదాయ వ్యయాలు, సంవత్సర ఫలితాలు, పరిహారాలు వాటిని గురించి వివరించారు. అనంతరం శిల్పారామం ప్రత్యేక అధికారి జీ కిషన్‌రావు కమలాకర శర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలలో భాగంగా డాక్టర్ హిమబిందు కనోజ్ శిష్య బృందం ప్రదర్శించిన 'ఋతు శోభ' కూచిపూడి నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.


పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఆచార్య కమలాకర శర్మ


నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

# లగ్జరీ కారుకే.. ఓటు




## నగరంలో విలాస వాహనాల జోరు

**పెరుగుతున్న ఖరీదైన కార్లు.. రూ.20 లక్షల నుంచి 7 కోట్లపైనే..**
**గతేడాది 17,111 కార్లు.. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపుతో 18,217 లగ్జరీ కార్లు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 9(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో లగ్జరీ కార్లు చక్కర్లు కొడుతున్నాయి. విలాసవంతమైన కార్లు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఆర్టీఏ లెక్కల ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపుతో గ్రేటర్‌లో 18,217 కార్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. చాలా మంది వాహనదారులు విభిన్నంగా కనిపించే, అత్యాధునిక ఫీచర్లతో కూడిన వాహనాలను కొనుగోలు చేయడంపై ఆసక్తి చూపిస్తున్నారు. అప్పటికే వారికి లగ్జరీ బైక్, కారు ఉన్నా.. మార్కెట్లోకి మరింత స్టైలిష్ లుక్‌తో విడుదలయ్యే వాహనాలను కొనుగోలు చేస్తూ వారి గ్యారేజీలో చేరుస్తున్నారు. ఈ ట్రెండ్ ఒకప్పుడు సంపన్న కుటుంబాల్లో మాత్రమే కనిపించేది. కానీ ఇప్పుడు చాలా మంది లగ్జరీ బైక్/కారు కొనుగోలు చేయాలనే తాపత్రయ పడుతున్నారు. కొనుగోలు ఆలస్యమైనా, ఇతర ఖర్చులను తగ్గించుకుని లగ్జరీ ఫీచర్లతో ఉన్న వాహనాలను కొనుగోలు చేసి రయ్ రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. దీంతో లగ్జరీ కార్లకు డిమాండ్ పెరుగుతున్నది. కోట్ల రూపాయలు వెచ్చించి మరీ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణలో లగ్జరీ వాహనాలు ఎక్కువగా మహానగరంలోనే అమ్ముడుపోతున్నాయి. ప్రపంచ నగరాల కంపెనీలు హైదరాబాద్‌లో బ్రాంచీలు ఏర్పాటు చేయడం కూడా లగ్జరీ కార్ల అమ్మకాలకు ప్రోత్సాహం ఇస్తున్నట్టుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. రూ.20 లక్షల నుంచి రూ.7 కోట్ల వరకు విలువైన కార్లు అమ్ముడుపోతున్నాయి. గతేడాది రూ.20 లక్షలకు పైగా విలువ చేసే కార్లు 11,364 కార్లు అమ్ముడుపోగా, 2023-24 ఆర్థిక సంవత్సరం ముగింపుతో 18,217 కార్లు అమ్ముడుపోయాయని అధికారులు చెబుతున్నారు. ఇతరులకు భిన్నంగా ఉండాలనే ఆలోచనతోపాటు అందులో ఉండే భద్రతాపరమైన అంశాలతో ఎక్కువగా ఖరీదైన కార్లను కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

### గ్రేటర్‌లో రూ.20 లక్షల నుంచి రూ.7 కోట్లపై విలువజేసే కార్లు..!

| కంపెనీ | 2022-23 | 2023-24 ప్రస్తుతం |
|---|---|---|
| జాగ్వార్ ల్యాండ్ రోవర్ | 250 | 541 |
| ఆడి సిరీస్ | 195 | 354 |
| బీఎండబ్ల్యూ | 1540 | 975 |
| మెర్సిడైజ్ బెంజ్ | 1080 | 2622 |
| టయోటా కిర్లోస్కర్ | 5301 | 5690 |
| వోక్స్‌వ్యాగన్ | 29 | 374 |
| ఫోర్డ్ | 24 | 209 |
| కియా | 282 | 612 |
| మహేంద్ర | 537 | 3617 |
| ఇతర కంపెనీలతో కలిపి మొత్తం | 11,364 | 18217 |